తాగునీరు వృథా

పెదగంట్యాడ: ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదురుగా నాలుగురోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. పైప్‌లైన్లు పగిలిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. సరిపడా నీరు సరఫరా కావడంలేదు.



భవన నిర్మాణ కార్మికులకు..
భరోసా ఏది?

- సంక్షేమ పథకాలపై అవగాహన లేమి
- సభ్యత్వ నమోదులోనూ వెనుకబాటు


రాజీవ్‌నగర్‌లో కూడలిలో నిరీక్షిస్తున్న భవననిర్మాణ కార్మికులు

కూర్మన్నపాలెం: భవన నిర్మాణ కార్మికుల భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం 1998లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకం ప్రవేశపెట్టింది. మొదట్లో ఈ పథకం కేవలం భవన నిర్మాణ కార్మికులకు మాత్రమే ఉపయోగపడేది. అనంతరం అనేక రకాల పనులు చేసే కార్మికులు ఈ పథకంలో చేరడానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికులతో పాటు గ్రానైట్ కార్మికులు, ఉపాధి కూలీలు, టైలర్లు, ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, మెకానిక్ పనులు చేసే వారు సభ్యత్వం తీసుకునేందుకు అర్హులు. కానీ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకంపై కార్మికులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు.

నియోజకవర్గంలో.. నియోజకవర్గంలోని గాజువాక, కూర్మన్నపాలెం, నాతయ్యపాలెం, రాజీవ్‌నగర్, చినగంట్యాడ, అగనంపూడి తదితర ప్రాంతాల్లో వేలాది మంది నిర్మాణ రంగంలోని పలు విభాగాల్లో పని చేస్తున్నారు. వీరంతా ప్రమాద అంచుల్లో పని చేస్తున్న వారే. వీరికి అధికారులు అవగాహన కల్పించి సభ్యత్వం ఇప్పించాల్సిన బాధ్యత ఉంది. కానీ దీనిపై పెద్దగా అవగాహన కల్పించకపోవడంతో ఎక్కువ మంది ప్రయోజనం పొందలేక పోతున్నారు. చాలా మంది కార్మికులు ప్రమాదాల బారిన పడి వారి కుటుంబాలు నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందలేకపోతున్నారు. ఫలితంగా కార్మిక కుటుంబానికి ఎంతో కొంత ముట్టజెప్పి యజమానులు చేతులు దులుపుకుంటున్నారు.

సభ్యత్వ నమోదు ఇలా..

చేతివృత్తుల కార్మికులు 18 నుంచి 60 ఏళ్ల మధ్య కలిగి ఉండాలి. దరఖాస్తు చేసుకునేందుకు రెండు ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డు, **బ్యాంకు అకౌంట్ పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలతో పాటు కార్మికుడిపై ఆధారపడి జీవించే వారి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు అందజేయాలి. రూ.120 చెల్లించి కార్మిక శాఖ కార్యాలయంలో సభ్యత్వం పొందవచ్చు. ఒకసారి సభ్యత్వం తీసుకున్న వారి లేబర్ కార్డు పరిమితి 5 ఏళ్ల వరకూ ఉంటుంది. ఆ తర్వాత సభ్యత్వాన్ని** రెన్యువల్ చేసుకోవాలి.

ప్రయోజనాలు..

కార్మికుడు పనిచేసే చోట ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.2 లక్షల ఆర్థిక సాయం వర్తిస్తుంది. 50 శాతం అంగ వైకల్యం పొందిన వారికి రూ.లక్ష, సాధారణ మరణం పొందితే రూ.30 వేలు అందిస్తారు. వివాహం తర్వాత కార్మికునికి ఒక్కో కుమార్తెకు కాన్పు సమయంలో రూ.25 వేల చొప్పున రెండు కాన్పులకు ఆర్థిక సహాయం అందుతుంది. స్వల్ప మొత్తం చెల్లించి సభ్యత్వం పొందడం ద్వారా 5 ఏళ్ల పాటు కార్మికుడికి, ఆయన కుటుంబానికి భద్రత లభించడంతో పాటు సంక్షేమ పథకాలు కూడా పొందే సౌలభ్యం ఉంది.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్‌ఎస్ రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 ఏళ్ల నిండి 44 సంవత్సరాల లోపు, ఇంటర్ పాసైన వారు అర్హులన్నారు. రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్‌ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9490391324 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



దేవన్‌రెడ్డిని కలిసిన 87వ వార్డు నాయకులు


దేవన్‌రెడ్డిని సత్కరిస్తున్న 87వ వార్డు నాయకులు

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డిని ఆ పార్టీ 87వ వార్డు నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న వారికి కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. దేవన్‌రెడ్డిని కలిసిన వారిలో నాయకులు ప్రగడ వేణుబాబు, ఇల్లపు రాము, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, మార్పు శేషు, కర్రి నాగేశ్వరరావు, డి సత్తిబాబు, గుంట శ్రీను, ప్రగడ రాము, మార్పు గోవింద, రాంబిల్లి రాజు ఉన్నారు.

కార్మిక వర్గం నిర్వీర్యానికి కేంద్రం కుట్ర


ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పైడిరాజు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కులో కాంట్రాక్టు కార్మికులకు తొలగిస్తుంటే కూటమి ప్రభుత్వం చేష్టలు ఉడిగి చూస్తుందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పైడిరాజు ఆరోపించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అత్యధిక మెజారిటీతో గెలిపించినా ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు.కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు కార్మికులు చేపట్టిన దీక్షలకు శుక్రవారం ఆ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఎంతో మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయాలని చూస్తుంటే ఎమ్మెల్యే పల్లా పట్టనట్లు వ్యవహరించడం ఆశ్చర్యంగా ఉందన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక కుట్రలు చేస్తుందని ఆ రోపించారు. దీనిలో భాగంగానే కార్మిక వ్యతిరేక విధానాలను మోదీ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పి. చంద్రశేఖర్, ఎం. నాగభూషణ్, మన్మథరావు, ఆనంద్, డి. ఆదినారాయణ, కె. అచ్యుతరావు తదితరులు కేంద్ర ప్రభుత్వ విధానాలపై విరుచుకుపడ్డారు. అనంతరం కాంట్రాక్టు కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.





అంబేడ్కర్‌కు అవమానం

డిప్యూటీ మేయర్ దల్లి తీరుపై దళిత సంఘాల మండిపాటు


అంబేడ్కర్ విగ్రహం వద్ద బూట్లతో డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్

పెదగంట్యాడ: డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవింద్‌రెడ్డి ఇటీవల భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెదగంట్యాడ జంక్షన్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆయన బూట్లు ధరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీనిపై స్థానిక ఎస్సీ నాయకుడు, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు మార్టుపూడి పరదేశి స్పందించారు. ఇది చాలా బాధాకరమైన విషయమని అభ్యంతరం తెలిపారు. రాజ్యాంగ నిర్మాతను ఇంత దారుణంగా అవమానిస్తారా అని ప్రశ్నించారు. బూట్లు వేసుకొని నివాళులర్పించినందుకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛభారత్‌కు అనుమతి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఈనెల 25న స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో స్వచ్ఛ భారత్ నిర్వహించేందుకు రైల్వే అధికారులు అనుమతులిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్, మానవ వికాస వేదిక, మానవతా చారిటబుల్ ట్రస్ట్, లయన్స్‌క్లబ్, సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి కార్యక్రమం చేపట్టనున్నామని ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. అంతా కార్యక్రమంలో పాల్గొని స్టేషన్ ఆవరణాన్ని పరిశుభ్రం చేయడానికి సహకరించాలని కోరారు.



బాబాకు రొట్టెలతో అభిషేకం


అభిషేకంలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి షిర్డీసాయి మందిరంలో బాబాకు రొట్టెలతో అభిషేకం జరిపించారు. ముందుగా ఆలయంలో కాగడ హారతి, పంచామృతాభిషేకం నిర్వహించారు. పెదమడకకు చెందిన వెంకట రవితేజ, సౌజన్య దంపతులు రొట్టెలతో అభిషేకించారు. మధ్యాహ్నం పేదలకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కొయ్య రమణారెడ్డి, వ్యాసశర్మలు రవితేజ, సౌజన్య దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుదే అర్జాష్, సత్యలక్ష్మి, జి.శంభుడు, పి.రామారావు, పీఎల్ఎన్‌రాజు, కిషోర్‌రాజు, టోపీరాజు, సత్య శ్రీదేవి, లీలావతి, కన్నమ్మ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె పంపిణీ


సబ్బులు, నూనెను అందజేస్తున్న ఏఎంఓహెచ్ కిరణ్ కుమార్

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లోని వివిధ వార్డుల్లో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి శుక్రవారం సబ్బులు, నూనె పంపిణీ చేశారు. ఆయా వార్డుల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ వాటిని అందజేశారు. 66వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు నూనెలు, సబ్బులతోపాటు ఇతర సహాయక సామగ్రి కూడా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, నాయకులు గోమాడ వాసు, జి.సత్యనారాయణ, పెంటకోట పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





గ్రాట్యుటీ చెల్లించక పోతే కార్మికశాఖకు ఫిర్యాదు చేస్తా..

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్‌లో 29 ఏళ్ల పని చేసిన తనకు అధికారులు అన్యాయం చేస్తున్నారని ఉక్కు మాజీ ఉద్యోగి శరగడం రామారావు ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించినందుకు ఉద్యోగం నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు పోరాడి తనకు న్యాయం చేశారని, అయితే ఆరేళ్ల నుంచి గ్రాట్యుటీ చెల్లించకుండా తాత్సారం చేస్తున్నారని వాపోయారు. నెఫ్ట్ ఫామ్ లేదనే వంకతో అధికారులు కాలయాపన చేస్తున్నారని.. సకాలంలో చెల్లింపులు చేయని పక్షంలో కేంద్ర కార్మికశాఖకు ఫిర్యాదు చేస్తానని రామారావు తెలిపారు.

కొనసాగుతున్న ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె నాలుగో రోజూ కొనసాగింది. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలన్న డిమాండ్లపై ఈ నెల 20 నుంచి కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు నిరవధిక సమ్మెకు దిగారు. మొదట రోజు 61.8 శాతం విధులకు హాజరు కాగా రెండవ రోజు బుధవారం 68 శాతం విధులకు హాజరయ్యారు. అయితే గత రెండు రోజులుగా గైర్హాజరు అయిన వారి సంఖ్య పెరిగిందని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. యాజమాన్యం తొలగింపులు ఆపుతామని హామీ ఇచ్చే వరకు సమ్మె ఆపే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


అప్పలరాజు మృతదేహం

కూర్మన్నపాలెం : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. అగనంపూడికి చెందిన కర్రి అప్పలరాజు (37) భార్య అరుణ, పిల్లలు దినేష్, ప్రత్యూషలతో నివాసం ఉంటున్నాడు. ఉక్కు కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న అప్పలరాజు ఆర్థిక పరిస్థితి బాగోలేక పోవడంతో అప్పులు చేశాడు. తీర్చే మార్గం లేక ఇబ్బందులు పడుతున్నాడు. ఆ విషయంలోభార్యాభర్తలకు తరచూ గొడవలు జరిగేవి. మనస్పర్థలు రావడంతో అరుణ పిల్లలను తీసుకొని మాకవరపాలెం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. అప్పలరాజు గురువారం రాత్రి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మాట్లాడి తిరిగి తన ఇంటికి వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం ఏ షిఫ్టుకు వెళ్లాల్సిన అప్పలరాజు డ్యూటీకి రాలేదని తండ్రి కనకారావుకు ఉక్కు అధికారి తెలిపాడు. దీంతో రమణమ్మ కుమారుడు అప్పలరాజు ఇంటికి వెళ్లి తలుపు కొట్టినా తీయక పోవడంతో ఇరుగు పొరుగు వారితో తలుపులు బద్దలు కొట్టించి చూడగా, అప్పలరాజు బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరిపోసుకుని మృతి చెంది ఉన్నాడు. తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

పోలీసులకు చిక్కిన దొంగ

కూర్మన్నపాలెం: వివిధ చోరీలకు పాల్పడిన దొంగను దువ్వాడ క్రైం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 21న 86 వార్డు సైమన్ నగర్‌లో నివాసముంటున్న ఓ మహిళ సాయంత్రం వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి బైకుపై వచ్చిన రాజేష్ ఆమె మెడలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడు తెంపుకొని వెళ్లిపోయాడు. ఆ మహిళ 112కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. సీపీ ఆదేశాల మేరకు దువ్వాడ క్రైం ఎస్ఐ విలియమ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాలను ఉపయోగించిన దువ్వాడ పోలీసులు శుక్రవారం దువ్వాడ రైల్వే స్టేషన్ దరి మంగళపాలెం వద్ద మాటువేసి చోరీకి పాల్పడిన రాజేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. కాగా అతడిపై 7 ఏడు క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపారు. చోరీకి గురైన 3 తులాల బంగారు పుస్తెలతో తాడుతో పాటు గాజువాక కేసుకు సంబంధించి రెండున్నర తులాలు గొలుసు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం భైరిపురానికి చెందిన వ్యక్తిగా నిర్ధారించారు.



గెస్ట్ ఫ్యాకల్టీ అవసరమా..?

ఏయూ హెచ్‌వోడీల సమావేశంలో ఇదే చర్చ

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీల అవసరం ఏ మేరకు ఉందనేది మరోమారు చర్చకు దారి తీసింది. ఏయూ క్యాంపస్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులతో శుక్రవారం సమావేశమైన వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ వివిధ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. అంతర్గతంగా జరిగిన సమావేశం కావడంతో వివరాలు గోప్యంగా ఉంచారు. ఈ నెల 28న రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్లతో నిర్వహించే సమావేశానికి సమగ్ర నివేదికలతో హాజరు కావాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఇక్కడి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏయూలో జరిగిన సమావేశానికి ప్రాధాన్యం సంతరించికుంది. వర్సిటీలోని విభాగాల వారీగా పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు లెక్క తీసిన వీసీ రాజశేఖర్ ఒకింత విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విభాగాల్లో ఇంత మంది అవసరమా..? అని ప్రశ్నిస్తూనే.. వారిలో బోధనా నైపుణ్యత ఎంత ఉందనేది తెలుసుకునేందుకు మరోమారు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో అనుభవజ్ఞులను కొనసాగిస్తూనే.. కొత్తగా తీసుకునేందుకు ఎలా ముందుకెళ్లాలనే దానిపై అందరి అభిప్రాయాలను సేకరించినట్లు సమాచారం. ప్రస్తుతం వర్సిటీలోని అన్ని విభాగాల్లో కలిపి సుమారుగా 400 వరకు గెస్ట్ ఫ్యాకల్టీలు పనిచేస్తున్నారు. వీరిలో కొంతమందిని పద్ధతి ప్రకారం కాకుండా హెచ్‌వోడీలు తమకు నచ్చిన రీతిలో నియమించారనే ఫిర్యాదులు సైతం ఉన్నాయి. దీనిపై ఫోకస్ పెట్టిన వీసీ.. విభాగాల్లో ఎంతమంది అవసరం..? ఎవరిని ఉంచాలి..? ఎవరిని తీసేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

నేడు యోగా ఈవెంట్

మహారాణిపేట: యోగాంధ్ర వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం ఆర్కే బీచ్ రోడ్డులోని శాశ్వత వేదిక వద్ద జిల్లా స్థాయి యోగా ఈవెంట్ జరగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఈవెంట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు.



